క్లుప్తంగా

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సిద్ధేశ్వరుడు

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అర్చకులు స్వామి వారికి సుప్రబాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాలైన బెంగళూరు, తుమకూరు, శిర, హిరియూర్, పావగడ, చెలికెర, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు.

మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం


చికిత్స అందిస్తున్న వైద్యులు

పెనుకొండ: జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం 6వ మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. 32 మంది మూర్ఛ వ్యాధి గ్రస్తులు పాల్గొన్నారు. డాక్టర్ నీలేఖ్య, బెంగళూరు వైద్యులు చికిత్సలు అందించారు. అనంతరం రోగగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు వివరించారు. కార్యక్రమంలో జేవీవీ కార్యదర్శి హరి, ఇమ్రాన్, రమేష్, రామన్న, బాబా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ట


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పళవల్లిలో ఆదివారం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ట ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు కృష్ణశాస్త్రి, శ్రీనివాస శాస్త్రి మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఈ సందర్భంగా హోమాలు, యజ్ఞ యాగాదులు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ నరసింహ స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. మున్సిపల్ చైర్మన్ మాజీ ఏ శంకర రెడ్డి, బత్తినేని నాని, కౌన్సిలర్లు రాజేశ్, రవి, ఆలయ సమితి అధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి కృష్ణమూర్తి తదితర పదాధికారులు పాల్గొన్నారు.

ఏఐయూటీయూసీ జిల్లా కమిటీ ఎన్నిక

మడకశిర: పట్టణంలో ఆదివారం జరిగిన జిల్లా ప్రథమ మహాసభలో ఏఐయూటీయూసీ(ఆల్ ఇండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్ సెంటర్) జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఇన్‌చార్జ్ సుధీర్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్షుడిగా సీఎల్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా హరిప్రసూన్, కార్యదర్శిగా జీఎన్ అశోక్, కోశాధికారిగా మంజునాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా రమేష్, కవితమ్మ, జయవర్ధన్, రామచంద్రప్పతో పాటు 20 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి అశోక్ తెలిపారు.

గుండుమలలో మంత్రి పర్యటన


హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరరూరల్: గుండుమల గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు పర్యటించారు. ఆగస్టు1న ముఖ్యమంత్రి చంద్రబాబు గుండుమల గ్రామంలో సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా వారు ఎస్సీ కాలనీలో గుర్తించిన పింఛన్‌దారుల ఇళ్లు, హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజనప్ప నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


గుడిబండ రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు


మడకశిర- అమరాపురం రహదారిలో భూతప్ప కనుమలో మలుపు


గుడిబండ- రొళ్ల రహదారిలో ఇలా..

మలుపుల మాటున ముప్పు

గుడిబండ మండలంలోని పలు మలుపులు ప్రజల పాలిట శాపంగా మారాయి. రహదారుల వెంట వీధిలైట్లు లేకపోవడంతో రాత్రిపూట వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పొద్దుపోయిన తర్వాత పనుల నుంచి వాహనాలపై ఇళ్లకు చేరే ఉద్యోగులు, కూలీలు, కార్మికులు మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు.

- హెచ్చరిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి

గుడిబండ : మలుపులు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. హెచ్చరికబోర్డులు లేకపోవడంతో మలుపుల వద్ద వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గుడిబండ – మడకశిర రహదారిలో ఫళారం క్రాస్ వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. సిమెంట్, గ్రానైట్ లారీలు, బస్సులు రాకపోకలతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటోంది. అతివేగంగా వచ్చే భారీ వాహనాలు ఈ మలుపులో వేగం అదుపుకాక బోల్తా పడుతున్నాయి. ఇక మడకశిర- అమరాపురం రహదారిలో భూతప్ప కనుమ అటవీ ప్రాంతంలో మూడు కిలోమీటర్లు నిడివి కలిగిన ఈ రహదారిలో సుమారు 9 మలుపులు ఉన్నాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు బాగుండడంతో వాహనచోదకులు రయ్ మంటూ అతివేగంగా ప్రయాణిస్తున్న క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బూదిపల్లి క్రాస్ వద్ద మలుపు వాహనదారులకు శాపంగా మారింది. మలుపులో ఎదురుగా వస్తున్న వారు కనిపించకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన జవనడుకు గ్రామానికి చెందిన గురుప్రసాద్ (ఫొటోగ్రాఫర్) శుభకార్యాన్ని ముగించుకుని రాత్రి పూట ద్విచక్రవాహనంపై వస్తుండగా బూదిపల్లి క్రాస్ వద్ద ఉన్న మలుపులో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో గురుప్రసాద్ కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గుడిబండ- రొళ్ల మార్గంలో దిన్నెహట్టి సమీపాన మలుపు అతి ప్రమాదకరంగా మారింది. ఈ మలుపులో నిత్యం ఏదో ఒకరు ప్రమాదానికి గురవుతున్నారు. ప్రతీ శుక్రవారం గుడిబండ పశువుల సంత మార్కెట్‌కు వచ్చే వాహనాలు తరుచూ ఇక్కడి మలుపుల వద్ద ప్రమాదాలబారిన పడుతున్నాయి. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి.. మలుపుల వద్ద ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలతో మన్ననలు పొందాలి


జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: మంచి పనులు చేస్తూ ప్రజాసేవా కార్యక్రమాలతో మన్నలు పొందాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక సూచించారు. ఆదివారం రాత్రి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దీపిక చారిటబుల్ ట్రస్టు మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రజలకు సేవలు అందిస్తున్న దీపిక చారిటబుల్ ట్రస్టు సభ్యులకు అభినందన సర్టిఫికెట్లు అందజేశారు. అంనతరం దీపిక మాట్లాడుతూ.. ప్రజలకు సేవలకు అందించడానికి అందరూ ముందుకు రావాలన్నారు. పట్టణంలో ఏడాదిగా సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్న దీపిక చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ డిసి నిహాల్, వైస్ ప్రెసిడెంట్ తరుణ్ తేజ్, కార్యదర్శి లక్ష్మీచంద్రకాంత్, జనరల్ సెక్రెటరీ శివబాల, సభ్యులు అఫ్రోజ్, వంశీ, చరణ్, నిఖిల్, యోగేష్, అశ్వర్థ నారాయణ, ధీరజ్, నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘం పాస్టర్ స్టీఫెన్ రాజు మాట్లాడుతూ.. పిల్లలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న ఆశలతో అహర్నిశలు శ్రమిస్తూ కొవ్వొత్తుల్లా కరిగిపోతున్నారన్నారు. తమ సుఖ సంతోషాలను త్యాగం చేస్తూ పెంచి పెద్ద చేసే తల్లిదండ్రులను గౌరవిస్తూ వృద్ధాప్యంలో వారికి తోడుగా నిలవాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రులను పిల్లలు శాలువాలు కప్పి పూలమాలతో సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి డాక్టర్ నాగేంద్రకుమార్, కోశాధికారి విక్టర్ జాషువా, జాయింట్ సెక్రెటరీ సాల్మన్ రాజ్, డీకెన్ సభ్యులు అరుణ్ కుమార్, దేవరాజ్, జార్జిబాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపు


కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపును అందిస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి నాగేంద్రలు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం శైలజ, మార్కండేయులు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ గత 40 ఏళ్ల నుంచి పేదలకు ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి కంటిచూపు అందిస్తున్నామన్నారు. శిబిరంలో 92మందికి కంటిపరీక్షలను చేయగా 55మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గోసే రాధాకృష్ణ, మెటికల కుళ్లాయప్ప, రాజగోపాల్, పల్లెం వేణుగోపాల్, గూడూరు మోహన్‌దాస్, కొత్త శ్రీరాములు, చందా నాగరాజు, పుట్లూరు నరసింహులు, వెంకటేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు బోనాలు


బోనాలు తీసుకెళుతున్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో సాలేవీధి పెద్దమ్మతల్లి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లోని మహిళలు ఆదివారం దుర్గమ్మదేవత, సాలేవీధి పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. 14వ వార్డుకు చెందిన మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మ, దుర్గమ్మ ఆలయాలకు చేరుకుని బోనాలను సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.

అనర్థాలకు కారకులైతే కఠిన చర్యలు


మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ పద్మజ

హిందూపురం టౌన్: ఆర్ఎంపీలు వచ్చీరాని వైద్యంతో ఏవైనా అనర్థాలకు కారకులైతే వారిపై కఠిన చర్యలు తప్పవని వైద్యాధికారులు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని అల్‌హిలాల్ పాఠశాలలో ఆర్ఎంపీలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాస్ మీడియా అధికారి బాబాఫకృద్దీన్, వైద్యాధికారులు డాక్టర్ పద్మజ, డాక్టర్ మాధుర్య మాట్లాడారు. ఆర్ఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోకుండా అత్యవసర సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు గాని, ఇతర అర్హత ప్రమాణాలు కలిగిన ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. జిల్లాలోని కొక్కంటిక్రాస్‌లో జరిగిన సంఘటనలు లాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. అలాగే 'క్లినిక్' అని, 'చిన్నపిల్లలకు ప్రత్యేకముగా చూడబడును' అనే బోర్డులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ప్రథమ చికిత్స కేంద్రాలు అని మాత్రమే బోర్డులు ఉండాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో బెడ్లు, సెలైన్ బాటిల్స్‌తో పాటు స్టాండ్లు, మంచాలు ఉండకూడదన్నారు. రోగులకు ఇంజక్షన్స్ వేయరాదని తెలిపారు. ప్రసవాలు, అబార్షన్లు చేయకూడదని స్పష్టం చేశారు. ల్యాబ్ పరీక్షలు నిర్వహించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆర్ఎంపీల సంఘం సభ్యులు గోవింద రాజులు, ఆంజనేయులు, ఏసురత్నం మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ముస్తఫా, రమేష్, మల్లప్ప, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైత్రి కూటమి విజయోత్సవం


డాక్టర్ జ్యోతి విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కూటమి సభ్యులు

అమరాపురం: స్థానిక వీరశైవ కళ్యాణ మంటపంలో ఆదివారం సాయంకాలం ఆరోగ్యమైత్రి కూటమి విజయోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కూటమి వ్యవస్థాపక అధ్యక్షుడు, అఖిల భారత చర్మ వ్యాధుల సంఘం అధ్యక్షుడు ఎస్‌డీఎన్.గుప్తా(అమరాపురం వాసి) మాట్లాడుతూ ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో డాక్టర్ లింగన్న, పద్మరాజ్‌జైన్, డాక్టర్ బసవరాజు తదితరులతో కలిసి 2005లో అమరాపురం వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా ఇప్పటి వరకూ 200 వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి 80 వేల మంది రోగులకు వైద్యం అందించామన్నారు. ఈసందర్భంగా శిబిరాల్లో సేవలు అందించిన వైద్యులను సన్మానించారు. అనంతరం జరిగిన వైద్యశిబిరంలో 1500 మందికి వైద్య సేవలందించారు. రోగులకు భోజన వసతి కల్పించారు. పద్మరాజ్ జైన్, జీపీ రాజు, అనిల్‌కుమార్‌జైన్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ బసవరాజు, శ్రీనివాసమూర్తి, రమేష్, తిప్పేస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనురాధ

చిలమత్తూరు: మండలంలోని దిగువపల్లి తండాలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాధ పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రత్యేకమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. జాతీయ ఆయుష్ కమిషన్ ద్వారా సరఫరా అయిన ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ నీలావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు


తహసీల్దార్ భద్రుజమను సన్మానిస్తున్న దృశ్యం

రొళ్ల: బదిలీపై వెళ్లిన తహసీల్దార్ ఎస్.భద్రుజమకు ఆదివారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా తహసీల్దార్ సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం తహసీల్దార్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఆర్ఐ మంజునాథ్, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డివారిపల్లిలో చోరీ


ఘటనపై ఆరా తీస్తున్న పోలీసులు

ఎన్పీకుంట: ఎన్.రెడ్డివారిపల్లిలోని ఓ ఇంటిలో చోరీ జరిగింది. బాధితురాలి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హసీనా ఇంటికి తాళం వేసి దిగువతూపల్లిలో ఆదివారం జరిగిన పీర్లపండుగకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపునకు వేసి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. దీంతోపాటు చీరలకు నిప్పుపెట్టారు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి హసీనాకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న హసీనా వెంటనే బీజేపీ మైనారిటీ మోర్చా కార్యవర్గ సభ్యుడు బాబ్జాన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనస్థలిని పరిశీలించారు.

భవిష్యత్‌కు బాటలు వేసుకోండి

మడకశిరరూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. ఆదివారం వారు గుండుమల బాలుర గురుకుల పాఠశాల, హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్‌లో సౌకర్యాలు, విద్య ప్రగతిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమీపంలో ఆగిపోయిన గురుకుల పాఠశాల భవనాలను పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ సర్పంచ్ చంద్రప్ప, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల చోరీ

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లిలో రైతు లక్ష్మీనారాయణరెడ్డికి చెందిన డ్రిప్ పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. పొలంలో మొక్కజొన్న పంట సాగు కోసం డ్రిప్ అమర్చగా శనివారం రాత్రి చోరీ జరిగినట్లు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల పొలాల్లో స్టార్టర్లు, విద్యుత్ తీగలు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు నిఘా పెంచి, చోరీలు నివారించాలని వారు కోరారు.

పూర్వ విద్యార్థుల కలయిక


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

హిందూపురం: స్థానిక మేళాపురంలోని వేళంగని మాత విద్యాలయంలో 2015లో ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చదువుకున్న రోజుల నాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పూర్వ గురువులను పూలమాలలతో సన్మానించారు.

12న కలశ ప్రతిష్ట

హిందూపురం: పేట వెంకటరమణ స్వామి దేవస్థానంలో ఆగస్టు 12వ తేదీన ఆలయ గోపుర కలశ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. శ్రావణ మాసంలో విమాన గోపుర కలశ ప్రతిష్ట, కుంభాభిషేకం, అష్టబంధన ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు, ఆగస్టు 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వివిధ కైంకర్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం జాతీయ అధ్యక్షుడిగా సుధాకర్



చిలమత్తూరు: శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం జాతీయ అధ్యక్షుడిగా మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన వడ్డి సుధాకర్ ఎంపిక అయ్యారు. ఆదివారం సుధాకర్ విలేకరులతో మాట్లాడారు. కళావేదిక కార్యక్రమాల్లో చురుకుగా ఉంటూ, కవితలు రాయడంలో ప్రతిభ చాటడంతో సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ తనను యువజన విభాగం జాతీయ అధ్యక్షుడిగా నియమించారన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రొళ్ల: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో అందించాలని సూచించారు.

నూనె విత్తనాల సంఘం డైరెక్టర్‌గా ఆంజనేయులు


ఆంజనేయులును సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తుమకూరు జిల్లా నూనె విత్తనాల సాగుబడిదారుల సంఘం డైరెక్టర్ గా తాలూకా లోని కోటగుడ్డ గ్రామానికి చెందిన జేడీఎస్ నాయకుడు, జెడ్పీ మాజీ సభ్యుడు కే ఓ ఆంజనేయులు ఎన్నికయ్యారు. చిత్రదుర్గంలోని కేంద్ర కార్యాలయంలో సహకార సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎన్నికలలో ఆయన ను డైరెక్టర్ గా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఎస్‌పి ఈరణ్ణ, ఆర్సీ అంజినప్ప, తిమ్మారెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు హర్షం ప్రకటించారు.

ముగిసిన మొహర్రం


సోమందేపల్లిలో పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని సానిపల్లిలో మొహర్రం సందర్భంగా జలధి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం యువకులు అగ్నిగుండం చుట్టూ అలావ్ ఆడారు. అనంతరం కుళ్లాయి పీర్లను భక్తిశ్రద్ధలతో జలధికి తరలించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని పాత ఊరులో మొహర్రం వేడుకలు ఆదివారం ముగిశాయి. కొద్దిరోజులుగా పీర్ల చావిడిలో కొలువు దీరిన పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జలధి సందర్భంగా పీర్లను ఊరేగించారు. భక్తులకు చక్కెర పానకం పంపిణీ చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా వేడుకలు సాగాయి.


రొద్దం మండలం సానిపల్లిలో కుళ్లాయి పీర్లు